# 3

# విరిగి నలిగిన స్థితియొక్క ధన్యత

# (2:1-10)

ఒక పేద వ్యవసాయదారుని కుమారుడు పేదరికంలో పెరిగాడు. వారి పొలానికి సమీపంగా ఉన్న ఒక చిన్న సమాజపు సంఘ కూడికకు అతడు చిన్ననాటనుండి వెళ్లేవాడు. దేవునియందు నమ్మికయుంచడం అతనికి నేర్పించారు. వారి సాధారణమైన విధానంలో, తమ నిత్య అవసరతల నిమిత్తము వాని తలిదండ్రులు దేవునియందు విశ్వాసముంచారు. నేలనుండి వచ్చేవాటితో జీవనం చేయడానికి వారు కష్టపడి పని చేశారు.

ఈ బాలుడు పెద్దవాడు కాగా, తాను పేదవాడుగా ఉండకూడదని తీర్మానించు కున్నాడు. సుఖజీవనానికి అతడు అలవాటు పడగోరాడు. ధనం కొరకైన తన పరిశోధనలో, భూమి (స్థలాలు) ధరలు పెరగడం మొదలు పెట్టినప్పుడు, వాటిని కొని అమ్మే వ్యాపారం ఆరంభించాడు. కొద్దికాలంలోనే, తాను ఊహించిన దానికంటెను యింకా ఎక్కువ ధనవంతుడయ్యాడు.

అతడు పెద్ద యిల్లు కట్టుకున్నాడు, బహు ఖరీదైన కార్లుకొన్నాడు, తన వ్యాపారపు హద్దులను విశాలపరచాడు. అతడును, అతని యింటివారును విలాసాలకు అలవాటు పడ్డారు. అప్పుడు ఆర్థిక పరిస్థితి క్షీణ దిశకు దిగుతుంది. స్థలాల వ్యాపారం బాగా పడిపోయింది. వడ్డీ రేట్లు పడిపోనారంభించాయి, అర్థిక మార్కెట్టు బలహీనమయ్యింది. తన కుటుంబం అలవరచుకున్న ఆడంబర జీవిత విధానం కొనసాగించడానికి తగిన డబ్బు లేకపోయింది. త్వరలోనే తాను చెల్లించలేనంతగా అప్పులలో చిక్కుకున్నాడు. అతడు సంపూర్ణంగా దివాలా తీశాడు.

కొద్దివారాలలో, తన చిరునవ్వులు విరుచుకుపడేలా మారిపోయాయి. బలీయమైన విశ్వాస పూరితంగా అడుగులు వేసికొంటూ వెళ్లేది మానిపోయింది, తన ముఖం దించుకొని సమస్తాన్ని కోల్పోయినవాడు నడిచినట్టు నడువసాగాడు. తన స్నేహితుల మధ్యను, వ్యాపారపు పాలివారి మధ్యను చిన్న చూపు చూడబడ్డాడు. నలిగిన వ్యక్తి, ఎదురు చూడని పరిస్థితుల్లో కృంగిపోయాడు. అతడు తిరిగి పేదరికంతో నలిగిపోయాడు. చిట్టచివరికి, ఆ సమాజాన్నే విడిచిపెట్టి మరో పట్టణంలో తన జీవితాన్ని తిరిగి ప్రారంభించాడు.

అలా విరిగిపోవడం ఆశీర్వాదకరమై యుండవచ్చు. మనయందు తన సంకల్పాన్ని నెరవేర్చుకొనడానికి ముందు కొన్నిసార్లు దేవుడు మనలను విరుగగొట్టి లైన్‌లో పెట్టవలసివస్తుంది. ఆయన ఎవరో గుర్తించలేని స్థితికి ప్రజలు దిగజారినప్పుడు, వారి దృష్టిని తన వైపుకు మళ్లించుకొనడానికి ఆయన ఎదో ఒకటి చేయవలసి యుంటుంది. పాప భూయిష్టమైన తమ జీవితాలను గుర్తించలేనంత స్థితికి ఒక దేశపు జనులు

దిగజారినప్పుడు, దేవుడు వారికి ఆ సంగతిని జ్ఞాపకం చేయగోరతాడు. ఆయన వారిని సరిచేసి దారిలో పెట్టి వారి ఆత్మల రక్షణకు అనుకూలమైన స్థితిలో నిలపడానికి వారి విరిగిన స్థితికి ఆయన అనుమతిస్తాడు. కష్టమైన అనుభవాల తరువాత, మన జీవితాలను సరిచేసికోలేమని తలంచవచ్చు గాని, దేవుడు చేయగలడు!

"హంటీ డమ్టీ" అనే చిన్నపిల్లల రైమ్స్‌లో నరుని భద్రతలేమి, వాని అల్పమైన స్థితి వర్ణించబడింది:

> హంటీ డమ్టీలు గోడమీద కూర్చున్నారు,
> హంటీ డమ్టీలు గొప్ప పాటు పడ్డారు.
> రాజు గుర్రాలన్నీ, రాజు పరివారమంతా,
> హమ్టీని తిరిగి కుదుటపెట్టలేక పోయారు.[1]

హంటీ డమ్టీ అనేది ఒక గ్రుడ్డులా చిత్రింపబడింది. అది ఎంత సున్నితమయ్యిందంటే, అది తేలికగా నూరు ముక్కలు కాగలదు. మానవ అహం, నరుడు తన్నుతాను ఉబ్బించుకునే స్థితి ఎంత తేలికగా పగిలిపోగలుగుతుందో నర్సరీ రైమ్ వ్యక్తపరచుతుంది. తనను గూర్చిన మానవ అభిప్రాయము దేవుని నిరాకరించడానికి, అలక్ష్యం చేయడానికి లేక దేవుడే లేడనడానికి చేరుకుందంటే, అట్టిది పతనానికి సిద్ధంగా ఉందన్న మాటే. "తాను నిలుచుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను" (1 కొరింథీ. 10:12) అని పౌలు రాశాడు.

యూదా ప్రజలు దేవుని నిరాకరించారు, ఆయన చివరిగా వారిని వెళ్లగొట్టాడు, దేవుని చర్యలలో యూదా యొక్క పతనాన్ని యిర్మీయా వర్ణించాడు: "యెహోవా ... చేసియున్నాడు" (2:6); "యెహోవా ఉద్దేశించెను" (2:8); "యెహోవా ... ముగించి యున్నాడు" (2:17). దేవుడు "కోపావేశుడై" (2:3); "మహోగ్రుడై" (2:2, 4), "చాల కోపము వచ్చినవాడై" (2:6) యూదా పతనమునకు కారణమును వ్యక్తపరచాడు (2:1). దేవుడే ఈ కార్యం జరిగించాడు; ఆయన యూదాను లయపరచాడు. తిరిగి పేదరికానికి పంపేలా ఆయన తన జనులను దివాలా తీయించాడు.

2:1-10లో, దేవుడు తన ఉగ్రతను రప్పించిన రెండు ఏరియాలను యిర్మీయా నిర్వచించి శిక్ష ఎందు నిమిత్తం వచ్చిందో తెలిపాడు.

## దేవుడు రాజ్యాన్ని విరిచివేశాడు

మొదట, దేవుడు యూదాను ఒక దేశంగా నాశనం చేశాడు.

> ప్రభువు కోపపడి సీయోను కుమార్తెను మేఘముతో కప్పియున్నాడు. ఆయన ఇశ్రాయేలు సౌందర్యమును ఆకాశమునుండి భూమిమీదికి పడవేసెను. కోపదినమందు ఆయన తన పాదపీఠమును జ్ఞాపకము చేసికొనకపోయెను. ఒకటియు విడువక ప్రభువు యాకోబు నివాసస్థలములన్నిటిని నాశనముచేసి యున్నాడు. మహోగ్రుడై యూదా కుమార్తె కోటలను పడగొట్టియున్నాడు వాటిని నేలకు కూల్చివేసియున్నాడు. ఆ రాజ్యమును దాని యధిపతులను ఆయన అపవిత్రపరచియున్నాడు. కోపావేశుడై

ఇశ్రాయేలీయులకున్న ప్రతి శృంగమును ఆయన విరుగగొట్టియున్నాడు. శత్రువులుండగా తన కుడి చెయ్యి ఆయన వెనుకకు తీసియున్నాడు. నఖముఖాల దహించు అగ్నిజ్వాలలు కాల్చునట్లు ఆయన యాకోబును కాల్చివేసి యున్నాడు. శత్రువువలె ఆయన విల్లెక్కు పెట్టి విరోధివలె కుడిచెయ్యి చాపియున్నాడు. కంటికి అందమైన వస్తువులనన్నిటిని నాశనముచేసి యున్నాడు. అగ్ని కురియునట్లుగా ఆయన తన ఉగ్రతను సీయోను కుమార్తె గుడారములమీద కుమ్మరించియున్నాడు. ప్రభువు శత్రువాయెను ఆయన ఇశ్రాయేలును నిర్మూలము చేసియున్నాడు దాని నగరులన్నిటిని నాశనము చేసియున్నాడు దాని కోటలను పాడుచేసియున్నాడు. యూదా కుమారికి అధిక దుఃఖప్రలాపములను ఆయన కలుగజేసియున్నాడు (విలాపవాక్యములు 2:1-5).

యూదా చాల చిన్న రాజ్యం. దాని చుట్టునున్న రాజ్యాలు బలపడుతున్న కాలంలో కూడ అది ఉనికిలో ఉందంటే మనం ఆశ్చర్యపడవచ్చు. దాని ఉనికికి దేవుడే ఎల్లప్పుడు మూలంగా ఉన్నాడు. అష్షూరు, ఐగుప్తు, బబులోను అనే దేశాల బెదిరింపులనుండి ఆయన యూదాను కాపాడుతునే ఉన్నాడు. ఆయన దక్షిణ హస్తబలము యొక్క సపోర్టు వారిని వెనుకకు నెట్టింది. యూదా జనులు ఈ విషయాన్ని గుర్తించి, అంగీకరించి నంతమట్టుకు, దేవుడు వారితో తన సహవాసాన్ని కొనసాగించుకొనడానికి వెనుకాడడు. ఎవరు, ఎందుకు వారిని కాపాడుతున్నాడో వారు మరచినప్పుడు, వారు తమ శత్రువుల చేజిక్కే పరిస్థితిలోనికి వస్తారు.

ఆయన కోపము మేఘమువలె "సీయోను కుమార్తెను" ఆవరించింది. పరలోకము నుండి దానికి అనుగ్రహింపబడిన సౌందర్యము వెళ్లిపోయింది. తన పాద పీఠమైయుండిన యూదా దేశాన్ని దేవుడు మరచిపోయాడు. కనికరము లేకుండ, తన ప్రజలయొక్క యిండ్లను దుర్గములను సహా ఆయన నాశనం చేశాడు. సున్నతి లేని అన్యజనులకు వారిని అప్పగించడంవలన యూదా రాజ్యాన్ని దాని అధిపతులను ఆయన అపవిత్రపరచాడు.

యాకోబును దేవుడు శత్రువుగా చూడసాగాడు. జ్వాలాగ్ని దాన్ని దహించి వేసినట్టును, నాశనము చేయు శత్రువు తన సైన్యముతో మీదపడి దాని శిబిరాలను కాల్చివేసినట్టును ఆయన ఆ దేశాన్ని మ్రింగివేశాడు. శత్రువువలె ఆయన తన విల్లును ఎక్కు పెట్టాడు, తన కోపాగ్నిని కుమ్మరించాడు.

గత నాలుగు వచనాలలో చెప్పబడిన విపత్తులన్నీ అయిదవ వచనంలో వల్లించ బడ్డాయి. తిరిగి చెప్పడమనేది హెబ్రీ పద్య కావ్య శైలియైయుంది. అది విషయాన్ని నొక్కి చెప్పడానికి వినియోగింపబడుతుంది. ఈ విధముగా, ప్రాస, లయ అనేవాటికి బదులు హెబ్రీ పద్య కావ్యం ఆలోచనా సమాంతరములచేత కట్టబడుతూ ఉంటుంది. నమ్మకస్థులు కాని దేవుని ప్రజలు "మ్రింగివేయబడ్డారు" అనే సత్యం తిరిగి చెప్పబడింది.

## దేవుడు తన నిబంధనవైపుకు తన వీపును త్రిప్పాడు

రెండవది, దేవుడు యూదాను తన ప్రజలుగా ఉండకుండునట్టు నిరాకరించాడు. వారితో ఆయన చేసికొన్న నిబంధనవైపుకు తన వీపును త్రిప్పాడు.

ఒకడు తోటను కొట్టివేయునట్లు తన ఆవరణమును ఆయన క్రూరముగా కొట్టివేసి

> యున్నాడు. తన సమాజస్థలమును నాశనముచేసియున్నాడు. యెహోవా సీయోనులో నియామక కాలము విశ్రాంతిదినము మరువబడునట్లు చేసియున్నాడు. కోపావేశుడై రాజును యాజకుని త్రోసివేసియున్నాడు. ప్రభువు తన బలిపీఠము విడనాడెను తన పరిశుద్ధస్థలమునందు అసహ్యించుకొనెను దాని నగరుల ప్రాకారములను శత్రువులచేతికి అప్పగించెను. వారు నియామక కాలమున జనులు చేయునట్లు యెహోవా మందిర మందు ఉత్సాహధ్వని చేసిరి. సీయోను కుమారియొక్క ప్రాకారములను పాడు చేయుటకు యెహోవా ఉద్దేశించెను. నాశనముచేయుటకు తన చెయ్యి వెనుకతీయక ఆయన కొలనూలు సాగలాగెను. ప్రహరియు ప్రాకారమును దీని గూర్చి మూల్గుచున్నవి. అవి యేకరీతిగా క్షీణించుచున్నవి. పట్టణపు గవునులు భూమిలోనికి క్రుంగిపోయెను దాని అడ్డగడియలను ఆయన తుత్తునియలుగా కొట్టి పాడుచేసెను. దాని రాజును అధికారులును అన్యజనులలోనికి పోయియున్నారు. అచ్చట వారికి ధర్మశాస్త్రము లేకపోయెను యెహోవా ప్రత్యక్షత దాని ప్రవక్తలకు కలుగుట లేదు (2:6-9).

ఆ దేశాన్ని ఆయన పాడుచేసిన దానికంటెను, యూదాతో తనకున్న నిబంధన సంబంధాన్ని దేవుడు రద్దుచేయడమనేది యింకా ఎక్కువ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. భాష తేటగానే ఉంది. కనీసం తాత్కాలికంగా, యూదాతో ఆత్మసంబంధమైన తన బంధకాలను తెంపివేసికొంటున్నాడు.

బబులోను దానిని ధ్వంసం చేయడం ద్వారా, తన గుడారానికి ఆయన బలత్కారం చేయించాడు. తన సమాజ కూడిక స్థలాన్ని లయపరచాడు, నియామక పండుగలను, సబ్బాతు దినాలను మరచిపోజేశాడు, తన బలిపీఠాన్ని దాని యాజకులను, తిరస్కారంతో చూచాడు, తన పరిశుద్ధ స్థలాన్ని, దేవాలయాన్ని విడిచిపెట్టాడు. తన పరిశుద్ధ పట్టణాన్ని నాశనం చేయించి, దాన్ని భద్రపరచిన గోడలను పడగొట్టించాడు. అన్నిటికంటె బహుగా విషాదకరమైన దాన్ని యిర్మీయా యిలా రాశాడు "అచ్చట వారికి ధర్మశాస్త్రము లేకపోయెను యెహోవా ప్రత్యక్షత దాని ప్రవక్తలకు కలుగుట లేదు" (2:9). కొంతకాలము దేవుడు తన ప్రజలతో, కనీసం మాట్లాడలేదు.

అవును, యూదా పాడగునట్లుగా దేవుడు చేశాడు, అయితే అలా జరగడానికి కారకులు దాని జనులే. విగ్రహారాధికులైన అన్యజనులను దానిలోనికి తెచ్చుటవలన దేవాలయపు నియమాన్ని వారు అతిక్రమించారు. దానిపై విగ్రహములకు బలియర్పించుట వలన వారు బలిపీఠాన్ని తేలిక చేశారు. ప్రజల కోర్కెలు నెరవేర్చడానికి లోనై జనులకు, దేవునికి మధ్యవర్తులుగా ఉండేవారి పరిశుద్ధమైన పనిని ఉల్లంఘించారు. దీర్ఘకాలంగా వారు ధర్మశాస్త్రాన్ని అలక్ష్యం చేశారు. దేవుడు ఏమి తెలుపగోరాడో అది కాకుండ జనులు ఏమి వినగోరారో దానిని వారి ప్రవక్తలు చెప్పారు. వారు తమ దేవుని నిబంధన నుండి తొలిగిపోయారు. ఈ దృష్టినుండి చూస్తే నిజంగా ఆ విపత్తంతటికి కారకులెవరు?

## కోరిన ఫలితాలను దేవుడు సాధించాడు

యూదాపైకి వచ్చిన శిక్ష కఠినమైనట్టిదిగా కన్పించినా, తాను కోరిన ఫలితాన్ని దేవుడు సాధించాడు: అది వారి విరిగినలిగిన స్థితి. బలహీనపరచబడినవారి స్థితిలో, దేవుని యొక్క అవసరతను జనులు గుర్తించారు.

> సీయోను కుమారి పెద్దలు మౌనులై నేల కూర్చుందురు తలలమీద బుగ్గి పోసికొందురు గోనెపట్ట కట్టుకొందురు. యెరూషలేము కన్యకలు నేలమట్టుకు తలవంచుకొందురు (2:10).

వేదనపడినవారై పెద్దలు గోనెపట్ట కట్టుకొని మౌనముగా నేలమీద కూర్చుండి, తమ తలలపై దుమ్ము వేసికొందురు. విలపించడానికి యిది సహజమైన విధానం లేక పద్ధతి. యోబును దర్శించడానికి యోబు యొక్క ముగ్గురు స్నేహితులు వచ్చినప్పుడు, వారు ఏడ్చి తమ వస్త్రములను చింపుకొని, తమ తలలమీద ధూళి చల్లుకొని రేయింబగలు ఏడు దినములు అతనితోకూడ నేలను కూర్చుండిరి (యోబు 2:12, 13). ఆఫ్రికాలోని కొన్ని నాగరికతల మధ్య నేడు ఈలాటి ఆచారాన్నే కలిగియున్నారు. జాంబియాలోని కబంగానందు, 1983లో, అక్కడి సమాజపు ప్రధాని చనిపోగా ఆ కుటుంబానికి సంతాపన తెలుపడానికి జనులు పోగైనప్పుడు, ఆ గ్రామానికి ప్రక్కన దున్నబడిన పొలములో తెల్ల వస్త్రములు ధరించుకొని విలపించుతున్న కొందరు కూర్చుండియుండడం నేను చూచాను. వారు ఆకాశమువైపు దుమ్ము (ధూళి) విసరుతూ, అది తమ తలలమీద పడునట్లు చూచుకొంటున్నారు.

యెరూషలేము కన్యకలు గర్విష్ఠులై ఒకప్పుడు తమ తలలను పైకెత్తుకొని ఓర చూపులు చూస్తూ కులుకుతూ నడిచేవారు, యిప్పుడు తమ తలలను నేలమట్టుకు దించుకొని నడువనారంభించారు. అది తగ్గించుకొని కాదు సుమీ, అవమానపరచబడినవారై "ఇక్కడనుండి మనం ఎక్కడికి వెళ్లబోతాం?" మనం తరచుగా చేసేలాగుననే వారును అడుగుతున్నట్టున్నారు.

## సందేశమేమి?

విరిగిన హృదయంతో, నలిగిన ఆత్మతో, లేక చితికిపోయిన అహంభావంతో నిన్ను నీవు గుర్తించగలవా? అవమానపరచబడిన స్థితితో, సిగ్గుతో నీవు బాధపడుతున్నావా? స్వయం సానుభూతిలోనికి దిగి అందులో పొర్లాడుతున్నావా? నీవు నీ తప్పులను తెలిసికొని, నీవు గతంలో ఉన్నదానికంటె శ్రేష్ఠమైన స్థితిలో దేవుడు నిన్ను ఉంచునట్టు నీ తప్పులలో నుండి పాఠాలు నేర్చుగోగలిగినట్టయితే, అది అంత చెడ్డది కాకపోవచ్చు.

కొండమీద ప్రసంగం చేసినప్పుడు ప్రభువైన యేసు నోటనుండి బయలుపడిన తొలి సూత్రము, "ఆత్మవిషయమై దీనులైనవారు ధన్యులు పరలోకరాజ్యము వారిది" అనేదే (మత్తయి 5:3). "ధన్యులు" అనేది "ఆనందభరితులు" అని కూడ కొన్నిసార్లు తర్జుమా చేయబడింది. ఆత్మ విషయములో దీనులైయుండియు ఆనందభరితుడుగా ఒకడు ఎలా ఉండగలడు? "ఆత్మ విషయమైన దీనత్వం," కుంగిపోయినట్టు సంతోషం లేనట్టు వినిపిస్తుంది.

ఈ లేఖన భాగములో "దీనులైనవారు" (పేదలైనవారు) ఏమి లేనిదానికంటె తక్కువైన వారు – దివాలా తీసినవారు, లేక పేదరికంచేత బాధింపబడినవారు. హృదయపు దివాలాదారుడు సంతోషంగా ఉండగలడా? అవును! ఈలాటి హృదయాలలో దేవుడు

పనిచేయగలడు. ఆయన యిట్టి హృదయాలలో నివసించి వాటిని మల్చి, తన స్వరూప మునకు వాటిని త్రిప్పగలడు. ఈ హృదయాలకు ఆయన గొప్ప ఉద్దేశాన్ని, జీవితానికి అర్థాన్ని ప్రసాదించగలడు. చెదిరిన ఈ గుండెలను తిరిగి సరియైన స్థితిలో ఉంచగలడు. తమంతట తాము ఉంటే, వారు ఎంత నిస్సహాయులో, నిరీక్షణా రహితులో అట్టి హృదయాలు గలవారు గ్రహించుతారు. వారు తమ దేవునికి లోబరచుకొనడానికి యిష్టపడి, "యెహోవా, నా దేవా, నన్ను తీసికొని నీకు అనుకూలమైన రూపులో నన్ను చేసికో" మని వారంటారు.

క్రీస్తుయేసు మనకు మాదిరియైయున్నాడు, ఫిలిప్పీ. 2:5-8లో మనం యిలా చదువుతాం,

> క్రీస్తుయేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్ను తాను తగ్గించుకొనెను.

"మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురుగదా? ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యమువలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను" (2 కొరింథీ. 8:9). ఇక్కడ ఉపయోగించబడిన "దారిద్ర్యము," "దరిద్రుడు" అనే పదాలు, మత్తయి 5:3లో ప్రభువు ఉపయోగించిన మాటలవంటివే. ప్రభువైన యేసు మన నిమిత్తము దరిద్రుడు, తన్నుతానే దివాలాకోరుగా చేసికొని, తన్ను ఖాళీచేసికొన్నాడు. ఆయన దారిద్ర్యత ఎదురుచూడని పరిస్థితివలన కలిగింది కాదు. అది సంపూర్ణంగా యిష్టపడి చేసికొన్నదే. ఆయన ధన సమృద్ధిలో మనము పాలుపొందు నట్లు ఆయన తన్ను దరిద్రునిగా చేసికొనడానికి యిష్టపడ్డాడు. అయినా ప్రభువైన యేసు దేవుని స్వరూపమందు ఆయనతో సమానుడే. నిజముగా ఆయన దేవుడే! (యోహాను 1:1). తానేమైయున్నాడో అది మనం కావాలని ఆయన అన్ని విషయములలో మనవంటి వాడయ్యాడు – దేవునితో ఏకమైయుండడం.

మన "అహమును" ఖాళీచేసికోమని ప్రభువైన యేసు మనకు బోధిస్తున్నారు. ఆయనను చూచి ఆయనను వెంబడించునట్లు మనం మన మార్గాలను విడిచి రావాలి. అహముతో నింపబడిన హృదయాలలో దేవునికి చోటు ఏ మాత్రమూ ఉండదు?

---

సూచన

[1]"Humpty Dumpty," *Childcraft: The How and Why Library,* vol. 1, *Once Upon a Time* (Chicago: World Book, Inc., 1989), 20.

## దేవుడు యిప్పుడైనా నీ దృష్టిని ఆకర్షించాడా?

ఆయన పిలుపును వినలేనంతగా దేవునికి దూరమైన ప్రజల యొక్క దేశం, తమ సృష్టికర్తయు సంరక్షకుడునైన వానియొద్దకు మరల్చబడునట్లు విపత్తును అనుభవింప వలసియుండవచ్చు. లోకస్థులుగా జీవించు సంఘ నాయకులు సువార్తికులు జనుల ఆత్మ సంబంధమైన అవసరతల పట్ల అక్కర లేనట్టు ఉంటే, తమ నిద్రలోనుండి వారు మేల్కొలుపబడునట్లు వారు హింసింపబడవలసియుండవచ్చు. త్యాగం చేయడం ప్రార్థించడం మరచిన సంఘం ఏదోవిధంగా తన మోకాళ్లమీదికి నడిపింపబడడం అవసరమై ఉంటుంది క్రీస్తు రక్తము ద్వారా రక్షణకంటెను లోకపు విజయములో మాదిరిగా నిలిచిన సంఘము దాని ధన సమృద్ధిగల స్థితినుండి లాగివేయబడడం అవసరమై ఉండవచ్చు.

తన వాక్యము ద్వారా దేవుడు మన దృష్టిని ఆకర్షించలేనట్టయితే, యూదా యొక్క దృష్టిని ఆయన పొందిన విధంగా మన దృష్టిని కూడ ఆయన ఆకర్షింపకోరవచ్చు. నవీన లోకంలో అది గొప్ప అపాయంగా కన్పించవచ్చు. “దేవుడు తన సంఘములోనుండి అదృశ్యుడవ్వడం” అంటే ఆయన పరిశుద్ధత సంఘానికి పరాయిగా ఉందంటే, దాని భావం సంఘములో చివరి అధికారం (ఆధిపత్యం) వ్యక్తిని సూచించేదైయుంటుంది అని డేవిడ్ వెల్స్ అభిప్రాయపడ్డాడు. [1]

చరిత్ర తానే తిరిగి వస్తుందా? వ్యక్తిగతమైన తమ కోరికలను దేవుని కోరికలని సూక్ష్మ బుద్ధిలేని సామర్థ్యంగల ప్రజలు తమ్మును తాము ప్రేరేపించుకొంటున్నారు. యిర్మీయా కాలంలోని ప్రవక్తలును యాజకులును ఈ సిద్ధాంతాన్ని బోధించారు. అది దేవుని చిత్తము అన్నట్టు సువార్తికులు తిరిగి మనుష్యులు వినగోరిన దానిని ప్రకటిస్తున్నారు.

దేవునికి నమ్మకత్వము, ఆయన చిత్తం పట్ల భక్తి ఒకప్పుడున్నట్టుగా లేకపోతుంది. ఆయన సత్యాలు సంపూర్ణములైయున్నట్టు, తన సత్యాన్ని ప్రకటిస్తున్నామని నటించేవారి మధ్య సయితం విశ్వసింపబడడం లేదు. లోకంపై సంఘం తన ప్రభావాన్ని కనుపరచే దానికి బదులు లోకమే తన ప్రభావాన్ని సంఘంమీద కనుపరచుతుంది. సమాజం మనలను ఏమి నమ్మనిస్తుందో – యింకను అంగీకరిస్తుందో – దానికిని దేవుడు మనలను ఏమి నమ్మగోరుతున్నాడో అనేవాటిమధ్య సంఘం యిరుకునపడియుంది. [2]

ఆఫ్రికాలోని జింబాబ్వేలో ఉన్న ఒక యువ మిషినెరీ భక్తికిని అతని విశ్వాసపు ప్రతిపాదనకును నేను ముగ్ధుడనయ్యాను. క్రీస్తునందలి తన విశ్వాసం కొరకు అతడు హతసాక్షియయ్యాడు, అతడిలా అన్నాడు:

> నేను సిగ్గుపడనివారి సహవాసములో భాగమైయున్నాను. నాకు పరిశుద్ధాత్మ శక్తి ఉంది. అచ్చుపోయబడింది. నేను ఆ గీతలోనికి వచ్చాను. నిర్ణయం చేయబడింది – నేనాయన శిష్యుడను నేను వెనుదిరుగను, విడిచిపెట్టను; వెనుకకు తగ్గను, ఆగిపోను. నా గతము క్షమించబడింది, నా ప్రస్తుతానికి అర్థముంది, నా భవిష్యత్తు భద్రం చేయబడింది. నీచంగా బ్రతకడానికి, వెలిచూపుతో నడవడానికి, మెత్తని మోకాళ్లకు, రంగులేని కలలకు, సాధుచేయబడిన దర్శనాలకు, లోకపు మాటలకు, చౌకబారు (కానుకల) సమర్పణకు మరగుజ్జు గమ్యాలకు నేను స్వస్థి చెప్పాను. [3]

నీవు దేవునివాడవైతే లోకము నిన్ను చేజిక్కించుకోలేదు. దేవుడు నీ దృష్టిని పొందగలిగితే, ఆయన నీ జీవితాన్ని వశపరచుకోగలడు. ఏదో విధంగా, దేవునిచే నూతన వ్యక్తిగా సృజింపబడడానికి, గతంలో నీవు ఏమైయున్నావో ఆ వ్యక్తి ధ్వంసం చేయబడాలి.

దావీదువలె పాడి, ప్రార్థించు:

> “దేవా, నాయందు శుద్ధ హృదయము కలుగజేయుము నా అంతరంగములో స్థిరమైన మనస్సు నూతనముగా పుట్టించుము” (కీర్తన. 51:10).

సూచనలు

[1]David F. Wells, *God in the Wasteland* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1994), 148-49. [2]Ibid., 154. [3]Brennan Manning, *The Signature of Jesus* (Sisters, Oreg.: Multnomah Press, 1996), 31.